సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
బుధవారం, ఏప్రిల్ 24, 2024
డిజిటల్

- 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు
- ఓటుకు నోటు కేసు తప్ప రేవంత్‌రెడ్డికి తనపై కక్ష ఏమి ఉంటుందన్న మాజీ సీఎం
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- ప్రభుత్వం కూలిపోతుందంటే రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదన్న కేసీఆర్
- ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని మా వద్దకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వస్తున్నారని వ్యాఖ్య



TV9 తెలుగు ఇంటర్వ్యూలో కేసీఆర్

# రేవంత్‌రెడ్డికి నాపై ఆ కక్ష ఉంది

తెలంగాణ ప్రభ, (హైదరాబాద్)

ఓటుకు నోటు కేసు తప్ప తనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇంకేం కక్ష ఉంటుందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. 2015లో ఓటుకు నోటు ద్వారా తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిరపరి చేందుకు రేవంత్ కుట్ర చేశారని ఆరోపించారు. ఎమ్మెల్సీ స్టీఫెన్ సన్‌కు రూ.50 లక్షలు ఇవ్వజూపి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని తెలిపారు. తనపై రేవంత్ రెడ్డికి అదే కక్ష ఉందన్నారు. మంగళవారం నాడు టీవీ9లో 'లైవ్ షో విత్ కేసీఆర్' కార్యక్రమంలో ఆయన ఓటుకు నోటు కేసు అంశంపై స్పందించారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తాను మళ్లీ ముఖ్యమంత్రిని అవుతానని విశ్వాసం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఈసారి గెలిస్తే ఇరవై ఏళ్లు అధికారంలో ఉంటామన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా తొలి ఇంటర్వ్యూను మీకే ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు భ్రమలో పడి మాత్రమే కాంగ్రెస్ పార్టీకి ఓటేసినట్లు తమ రివ్యూలో తేలిందన్నారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి షాక్ తప్పదన్నారు. బీఆర్ఎస్ 8 నుంచి 12 సీట్లు గెలవబోతుందని జోస్యం చెప్పారు. బీజేపీకి సున్నా నుంచి 1 స్థానాలు మాత్రమే వస్తాయన్నారు.

కడియం శ్రీహరి పార్టీ మారడంపై కూడా కేసీఆర్ స్పందించారు. కడియం శ్రీహరి తాను చచ్చి బీఆర్ఎస్‌ను బతికించారని వ్యాఖ్యానించారు. ఆయన ఖర్మ బాగాలేక కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని స్వేచ్ఛ... అధికారం పోయాక కడియం శ్రీహరికి గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ మహా సముద్రమని... పిడికెడు మంది పోతే పోయేదేం లేదన్నారు. తాను రాజకీయ పార్టీతో తెలంగాణ ఉద్యమాన్ని నడిపానని... అందుకే ఇక ఫక్తు రాజకీయాలు చేస్తామని 2014కు ముందే చెప్పామని గుర్తు చేశారు. పార్టీ నుంచి వెళ్లిన వాళ్లలో కొంతమంది తనకు ఫోన్ చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బయట పలువురు చెబుతుంటే రేవంత్ రెడ్డి ఖండించడం లేదన్నారు. అయినా కాంగ్రెస్ పార్టీలోనే చాలా అనిశ్చితి ఉందన్నారు. కాంగ్రెస్ వాళ్లలో కొంతమంది ఎమ్మెల్యేలు తమ నేతలను సంప్రదిస్తున్నారని తెలిపారు. 20 నుంచి 25 మంది ఎమ్మెల్యేలం సిద్ధంగా ఉన్నట్లు తమకు చెబుతున్నారన్నారు. మనమంతా కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని వాళ్లే చెబుతున్నారని వ్యాఖ్యానించారు. మా వాళ్లతో ఆ ఎమ్మెల్యేలు సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. కానీ తాము మాత్రం ఆ విషయంపై ఇంకా చర్చించలేదన్నారు.



రిపోర్టర్లు కావలెను

సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి 'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక' ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.

కరీంనగర్, జగిత్యాల పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు, నియోజక వర్గాల వారీగా ఆర్సీలు కావలెను

మెదక్ ఉమ్మడి జిల్లా..

ఆందోల్, గజ్వేల్, జహీరాబాద్, దుబ్బాక, నర్సాపూర్, నారాయణ్‌ఖేడ్, పటాన్‌చెరు, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గాలకు ఆర్సీలు కావలెను

ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి

సెల్: 99854 44342

## గడువులోగా యూనిఫాం క్లాత్ అందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- టెక్స్‌టైల్ పార్కులోని వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తి పరిశీలన

3 లో



## అంబం (ఆర్) గ్రామంలో కుస్తీ పోటీలు

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** రుద్రూర్ మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో హనుమాన్ జయంతి పురస్కరించుకుని మంగళవారం గ్రామంలో పోచమ్మ గుడి దగ్గర కుస్థి పోటీలను నిర్వహించారు. పోటిల్లో మల్లాయోధులు ఆసక్తిగా పాల్గొని కోటగిరి, వర్ని, రుద్రూర్, మండలాలతో పాటు పక్క రాష్ట్రం మహారాష్ట్ర నుండి మల్ల యోధులు వచ్చి కుస్థి పోటిల్లో పాల్గొన్నారు. పోటిల్లో గెలుపొందిన మల్లాయోధులకు నగదు రూపంలో అందించారు. ఈ కుస్థి పోటీలను సంప్రదాయం ప్రకారం ప్రతియేటా హనుమాన్ జయంతికి సందర్భంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కుస్తీ పోటీల్లో పాల్గొన్నావారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శానం పోశెట్టి, కార్యదర్శి కమ్మరి రవి, గ్రామ పెద్దలు పట్టేపు రాములు, మంత్రి గంగారాం, అత్కూరి మహేష్, మంత్రి నర్సయ్య, హన్మాండ్లు, నాగనాథ్ తదితరులు ఉన్నారు.



## రాజేశ్వర్ మృతి తీరని లోటు

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** సాలూర మండల ఎంపీపీ భర్త బుద్దే రాజేశ్వర్ మృతి బోధన్ నియోజకవర్గ ప్రజలకు తీరని లోటు అని నిజాంబాద్ పార్లమెంటు తెలుగు యువత ఇన్చార్జ్ ఎత్తోండ రాజేందర్ అన్నారు. రాజేశ్వర్ మొదటి సారి తెలుగుదేశం పార్టీ తరపున ఎంపీటీసీగా గెలిచి తరువాత రెండు సార్లు సర్పంచుగా గెలిచి ప్రతిక్షణం ప్రజల కోసం అనునిత్యం పోరాడిన ఏకైక వ్యక్తి రాజేశ్వర్ అని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతున్ని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని తన ప్రకాడ సానుభూతి సంతాపం తెలిపారు.

### ప్రాజెక్టులపై సీఎంగా నాది కేవలం వ్యూహమే..

### TV9 తెలుగు ఇంటర్వ్యూలో కేసీఆర్

# నాకేమీ ఇంజినీరింగ్ భాష తెలియదు

- కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ కేసీఆర్ దేనని కాంగ్రెస్ నాయకులు చెప్పడం మూర్ఖత్వమేనని వ్యాఖ్య
- సమైక్య పాలనలో ఏ ప్రాజెక్టూ పూర్తి కాలేదని విమర్శ
- కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి ఢోకా లేదన్న కేసీఆర్
- అసలు రేవంత్ రెడ్డిని లెక్కలోకే తీసుకోనన్న బీఆర్ఎస్ అధినేత





**తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) :** తెలంగాణలో ప్రాజెక్టులపై ముఖ్యమంత్రిగా తనది కేవలం వ్యూహం మాత్రమేనని.. తనకు ఇంజినీరింగ్ భాష తెలియదని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ కేసీఆర్ చేశారంటూ కాంగ్రెస్ నాయకులు చెప్పడం మూర్ఖత్వమే అన్నారు. మంగళవారం టీవీ9లో 'లైవ్ షో విత్ కేసీఆర్' కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేత మాట్లాడుతూ... సమైక్య పాలనలో ఏ ప్రాజెక్టూ పూర్తి కాలేదని విమర్శించారు. మైనర్ ఇరిగేషన్ ధ్వంసమైందన్నారు.

భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయన్నారు. కానీ తాము వచ్చాక అన్నింటిని సరిదిద్దే ప్రయత్నం చేశామన్నారు. ఎత్తులో ఉన్న తెలంగాణకు నీళ్లు రావాలంటే ఎత్తిపోతలే దిక్కు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా వాడుకోవాలో తెలియని అసమర్థులు.. అర్భకులు కాంగ్రెస్ వాళ్లు అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి ఢోకా లేదన్నారు. మేడిగడ్డ మూడు పిల్లర్లలో ఒక బ్లాక్‌లోని ఇబ్బందిని కాంగ్రెస్ వారు పెద్దదిగా చూపిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంలో టన్నెల్స్, పంప్ హౌజ్‌లు అన్నీ బాగానే ఉన్నట్లు చెప్పారు.

పిల్లర్ కుంగినట్లు ఎన్నికలకు ముందే తెలుసునని... అందుకే బాగు చేయాలని అధికారులను కూడా ఆదేశించానన్నారు. కానీ ఇప్పుడు తనను బద్నాం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రిపేర్ చేయించకపోయినా ఏం కాదన్నారు. కాళేశ్వరం కెపాసిటీ 16 టీఎంసీలేనని తెలిపారు. ఎండాకాలంలో రెండో పంటకు, సాగునీటికి కాళేశ్వరం కీలకమన్నారు.

### రేవంత్ రెడ్డిని లెక్కలోకి తీసుకోను

ప్రస్తుతం తెలంగాణలో అంతా దేవుళ్ల మీద ఒట్లు... కేసీఆర్ మీద తిట్లు నడుస్తున్నాయని కేసీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి తమ పార్టీలో కూడా కొన్నాళ్లు ఉన్నారని... కానీ ఆయన పాలనలో అహంకారం, అజ్ఞానపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చెరిపేస్తామని ఆయన చెబుతున్నారని.. కానీ అది అసాధ్యమన్నారు. అలాంటి ఆలోచనే వికృతమైందన్నారు. అసలు రేవంత్ రెడ్డి తనపై చేసే దాడిని తాను లెక్కలోకే తీసుకోనని తెలిపారు. ఎవరికైనా రాజకీయంగా టైమ్ వస్తుందన్నారు.

ఉద్యమం సమయంలో తాను ఆంధ్రాకు వ్యతిరేకమని చాలామంది అనుకున్నారని... కానీ బీఆర్ఎస్ పాలనలో ఎవరూ బాధపడలేదని పేర్కొన్నారు. తెలంగాణ మీద.. వనరుల మీద.. ఉద్యోగాల మీద తెలంగాణ వారికే అవకాశం ఉండాలని మాత్రమే అనుకున్నామని... అది సాధించామన్నారు. కానీ వికృతమైన వ్యతిరేక భావనతో తాము మనుషుల మధ్య గోడ కట్టలేదన్నారు.





### అమెరికాకే అప్పులు ఉన్నాయి

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పెద్ద మొత్తంలో అప్పులు చేశారన్న కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కౌంటర్ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే క్రమంలో ప్రభుత్వాలు అప్పులు చేస్తాయన్నారు. మంగళవారం టీవీ9లో 'లైవ్ షో విత్ కేసీఆర్' కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేత మాట్లాడుతూ... తమపై కాంగ్రెస్ నేతలు నిత్యం అప్పులు ఎక్కువ చేశారని విమర్శలు చేస్తున్నారని... కానీ అత్యంత ధనిక దేశమైన అమెరికాకే ఎక్కువ అప్పులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ బడ్జెట్‌కు... ప్రయివేటు వ్యక్తి బడ్జెట్‌కు తేడా ఉంటుందన్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తోందని విమర్శించారు.

అప్పులపై తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. ఆడిట్ లెక్కలను కూడా కాంగ్రెస్ కాకిలెక్కలుగా చెబుతోందని మండిపడ్డారు. అప్పులు తెచ్చుకోవడం బడ్జెట్‌లో భాగమన్నారు. అప్పుల్లో తెలంగాణ 24వ స్థానంలో ఉందని గుర్తించాలన్నారు. అత్యధిక మూలధనం వ్యయం చేసిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. అప్పులపై అసెంబ్లీలో జరిగిన చర్చ చూసి తనకు నవ్వు వచ్చిందని ఎద్దేవా చేశారు. మోదీ అధికారంలోకి వచ్చాక అప్పులకు సంబంధించి పరిమితి విధించారన్నారు. ప్రతిపక్షాలను దెబ్బకొట్టేందుకు మోదీ అలా చేశారన్నారు.

### కాంగ్రెస్ సభలు అట్టర్ ఫ్లాప్ అవుతున్నాయి

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలన్నీ అట్టర్ ఫ్లాప్ అవుతున్నాయన్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్ర... దీనిని ఎవరూ కాదనలేరన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని అసెంబ్లీలోనే అన్నవాళ్లు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఒక చిన్న మతకల్లోలం లేకుండా తాము పదేళ్లు పాలించామని తెలిపారు. తమను ప్రజలు తిరస్కరించలేదని... మూడొంతుల సీట్లు వచ్చాయని తెలిపారు.

విభజన తర్వాత ధ్వంసమైన, శిథిలమైన తెలంగాణ తమ చేతికి వచ్చిందన్నారు. సమైక్య పాలనలో చెరువులను గాలికి వదిలేశారన్నారు. కానీ తాము తెలంగాణను అభివృద్ధిలో నిలిపామన్నారు. ధ్వంసమైన తెలంగాణను తాము పునర్నిర్మించామన్నారు. ప్రజలు మోసపోయి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని వ్యాఖ్యానించారు. అప్పట్లో 'ఇందిర అంటే ఇండియా, ఇండియా అంటే ఇందిర' అన్నారని... కానీ ఆ తర్వాత కాంగ్రెస్ పరిస్థితి ఏమైందో అందరికీ తెలిసిందే అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. పాలనను గాలికి వదిలేసిందన్నారు. బజారు భాష మాట్లాడటం వేరు... పరిపాలన వేరు అన్నారు. కాంగ్రెస్ శ్వేతపత్రాలు అన్నీ బోగస్ పత్రాలే అన్నారు. కాంగ్రెస్ బట్టకాల్చి మీద వేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. మిషన్ కాకతీయ పేరుతో తాము చెరువులను బాగు చేశామన్నారు.

### వనరులను వాడుకోలేని దద్దమ్మలు.. అసమర్థులు

కరెంట్ విషయంలోనూ కాంగ్రెస్ వెకిలి ప్రయత్నాలు చేస్తోందని కేసీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ఏం చేసినా అసలు నిజాలు ప్రజలకు తెలియకుండా చేయలేదన్నారు. విద్యుత్ ఒప్పందాలలో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి తాము రూ.13కు విద్యుత్‌ను కొనుగోలు చేసినట్లు ఆరోపించారని.. కానీ అంతమొత్తానికి కొనుగోలు చేయలేదన్నారు. కేసీఆర్ అధికారంలో నుంచి దిగిపోగానే పవర్ కట్స్ ఎందుకు అవుతున్నాయి? మోటార్లు ఎందుకు నడవడం లేదు? అని ప్రశ్నించారు. తాము ఇరవై నాలుగు గంటలు కరెంట్ ఇచ్చామన్నారు. విద్యుత్‌కు కాంగ్రెస్ ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. అందుకే ఉన్న వనరులను, విద్యుత్‌ను వాడుకోలేని అసమర్థులు... దద్దమ్మలు కాంగ్రెస్ వాళ్లు అని తీవ్ర విమర్శలు చేశారు.







# గడువులోగా యూనిఫాం క్లాత్ అందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- టెక్స్ టైల్ పార్కులోని వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తి పరిశీలన



**తెలంగాణ ప్రభ, (తంగళ్ళపల్లి) :** నిర్దేశిత గడువులోగా స్కూల్ యూనిఫాం క్లాత్ అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.తంగళ్లపల్లి మండలంలోని టెక్స్ టైల్ పార్కులో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కుట్టించే స్కూల్ యూనిఫాం క్లాత్ ఉత్పత్తి చేసే వస్త్ర పరిశ్రమలో కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దారం నుంచి మొదలుకొని బట్ట ఉత్పత్తి వరకూ వివిధ దశలు క్షుణ్ణంగా పరిశీలించారు. బట్ట తయారీని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నాణ్యతను తెలుసుకున్నారు. కార్మికులతో మాట్లాడి తయారీ పై మరిన్ని వివరాలు తెలుసుకొని, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ స్కూల్ యూనిఫాం క్లాత్ ఉత్పత్తి చేయాలని సూచించారు. గడువులోగా క్లాత్ ను కట్టించేందుకు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదివే విద్యార్థులకు మొత్తం 1,15,816 యూనిఫాంలు కుట్టించనున్నారు. మహిళా సంఘాల బాధ్యులు 768 మందికి ఉపాధి లభించనుంది.ఇక్కడ టెక్స్టైల్ ఆర్డీడీ అశోక్ రావు, ఏడీ సాగర్, డీఆర్డీఓ శేషాద్రి, డీఈఓ రమేష్ కుమార్ పాల్గొన్నారు.

**పీహెచ్ సీ సందర్శన**

తంగళ్లపల్లి మండలం నేరెళ్ల పీహెచ్ సీ కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానకు వస్తున్న ఓపీ వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళా కింద ఎంత మందికి పరీక్షలు చేశారు? వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని డాక్టర్ ను అడిగారు. అనంతరం దవాఖానకు నిత్యం ఎంత మంది రోగులు వస్తున్నారు? వారికి ఏ ఏ పరీక్షలు చేస్తున్నారు, వడ దెబ్బ కేసులు ఏమైనా నమోదు అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. ఓఆర్ఎస్ పాకెట్స్ నిల్వల వివరాలు సే కరించారు. అనంతరం క్యాన్సర్, బీపీ, షుగర్ పేషంట్స్ ఎవరైనా ఉన్నారా..? వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. గత నెలలో ఎన్ని డెలివరీలు అయ్యాయని తెలుసుకోగా, 23 అయ్యాయని, 14 ప్రభుత్వ ఆసుపత్రిలో, 9 ప్రైవేటు ఆసుపత్రిలో అయినట్లు వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుమన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ రజిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఉమా దేవి, డీడీఎం కార్తీక్, మెడికల్ ఆఫీసర్ రేఖ, ఎంఎల్ హెచ్ పీ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి

## మార్మోగిన 'జై శ్రీరాం' నినాదాలు

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మొత్తం హిందూ సంఘాలు బీజేపీ నాయకులు కలిసి వేడుకలను ఘనంగా జరిపించారు. హనుమంతుడి ఆశీర్వాదం తో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నారు బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కన్వీనర్ డా ఎస్ మల్లారెడ్డి. ఈ సందర్భగా ఆయన కుత్బుల్లాపూర్ లోని జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, దేవేందర్ నగర్, సూరారం లలో భజరంగ్ దల్, హిందూ వాహిని, వారు నిర్వహించిన కార్య్రమంలో పాల్గొని ప్రసంగించారు.

**జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో**

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ శోభయాత్ర లో ఎమ్మెల్యే వివేకానంద కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రుద్రా అశోక్, యువ నాయకులు జైహింద్, సీనియర్ నాయకులు ఎత్తరి మారయ్య, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ చైర్మన్ వేణు యాదవ్ పాల్గొన్నారు.





**కోరుట్లలో..**

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** పట్టణంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పలు దేవాలయాల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అంజన్నను దర్శించుకున్నారు. అలాగే హనుమాన్ జయంతినీ పురస్కరించుకొని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్తిని అనిల్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.





## లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే వివేకానంద ప్రచారం

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** మల్కాజ్గిరి పార్లమెం ట్ ఎన్నికల నేపథ్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్ పురి కాలనీలో మంగళవారం నిర్వహించిన, ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ తోనే సాధ్యమన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, క్రమశక్తి అవార్డు గ్రహీత ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, శ్రీనివాస్, హజరత్ అలీ, శ్రీను, పాపులు గౌడ్, రాములు, జైహింద్, మల్లారెడ్డి, నర్సింగ్ పాల్గొన్నారు.

## హెచ్ఎం ఉద్యోగ విరమణ

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గడేల భూపతి ఉద్యో గ విరమణ సన్మానోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఎన్నో సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయులుగా పాఠశాల అభివృద్ధి కోసం, విద్యార్థుల ఎదుగుదల కొరకు చేసిన సేవలు మరువలేవని కొనియాడారు. ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.




## ఘనంగా 'మెగా 2024' వార్షికోత్సవం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా కేంద్రంలో మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లో 'వైభవ్' ది మనసా అన్యువల్ ఫెస్ట్ 2024 పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల చైర్మన్ శ్రీమతి మంజుల రమాదేవి రవీందర్‌రావు, డైరెక్టర్ మౌనికా హరిచరణ్‌రావు, ప్రిన్సిపాల్ రజితరావు, జ్యోతి ప్రజ్వలన చేసి , హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులచే హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమం తో ప్రారంభించారు. ఈ వేడుకలలో విద్యార్థిని విద్యార్థులు పలురకాల సాంస్కృతిక, జానపద నృత్యాలు, వెస్ట్రన్ డాన్స్ లు, నాటికలు, విద్యార్థుల తల్లీదండ్రులకు నిర్వహించిన పోటీలు మొదలగు రకరకాల కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకర్షించాయి. కార్యక్రామంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, హరిచరణ్‌రావు , మౌనికరావు, సుమన్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.